
మొక్కలు చిన్నవే.. ప్రమాదాలు పెద్దవి

- వంతెన పిల్లర్లు, రెయిలింగ్ మధ్య పెరుగుతున్న వైనం
- క్రమంగా శిథిలావస్థకు చేరుతున్న వంతెనలు


జింఖానా క్లబ్ ఎదురుగా ఏలూరు కాల్వ వంతెన పిల్లర్లు, రెయిలింగ్ మధ్య పెరిగిన మొక్కలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మొక్కే కదా అని వదిలేస్తే.. అవి మానులై వంతెనలను దెబ్బతీస్తున్నాయి. వేర్లు పెరిగి వంతెనకు నిర్మించిన రెయిలింగ్‌ను దెబ్బ తీస్తున్నాయి. శ్లాబ్‌కు నెర్రెలిస్తున్నాయి. క్రమేపీ వంతెనలు శిథిలావస్థకు చేరుతున్నాయి. వంతెనలకు ఇరువైపులా రావిచెట్లు, ఇతర పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి ఫుట్‌పాత్‌పైకి విస్తరిస్తున్నాయి. నగరంలోని ప్రధాన కాల్వలపై నిర్మించిన వంతెనల వద్ద వివిధ రకాల చెట్లు దర్శనమిస్తున్నాయి.

వేర్లతో సహా తొలగించాలి

విజయవాడ నగరం మధ్యలో బందరు, రైవస్, ఏలూరు మూడు ప్రధాన కాల్వలు ప్రవహిస్తున్నాయి. వీటిపై ప్రధాన కూడళ్ల వద్ద ఏళ్ల కిందట వంతెనలు నిర్మించారు. కాల్వగట్లపై ఉన్న చెట్ల కాయలు ఎండిపోయి గాలికి వంతెన ఖాళీ ప్రదేశాల్లో పడటం, పక్షులు వ్యర్థాలు వేయడం ఇలా వివిధ మార్గాల్లో ఈ వంతెనల పిల్లర్లు, సైడ్ రెయిలింగ్ మధ్య రావి, సుబాబుల్, ఇతర జాతుల మొక్కలు మొలిచాయి. అవి కాస్తా ఏపుగా పెరిగి వంతెన రెయిలింగ్‌ను దెబ్బతీస్తున్నాయి. వేర్లు బలంగా పెరిగి రెయిలింగ్‌కు, ఫుట్‌పాత్ మధ్యకు చేరుతున్నాయి. ఫలితంగా దానికి ఏర్పాటు చేసిన టైయిల్స్ పగిలిపోయి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెయిలింగ్ కూలిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది మొక్కలే కదా అని వదిలివేయడంతో అవి మానులై వంతెనలకు ప్రమాదం తెస్తున్నాయి.


మీసాల రాజారావు వంతెన వద్ద పెరిగిన మొక్క


ప్రభాస్ కాలేజీకి వెళ్లే మార్గంలో వంతెన పక్కన పెరిగిన చెట్లు.. దెబ్బతిన్న ఫుట్‌పాత్

కొన్ని వంతెనల వద్ద వాటర్ పైపులైన్లు ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేశారు. అవి కూడా దెబ్బతింటున్నాయి. వంతెనలను శిథిలావస్థకు చేరుస్తున్నాయి. ఈ చెట్ల మూలంగా వర్షాలు పడినప్పుడు నీరు నిలిచి వంతెన శ్లాబులు పెచ్చులూడి శిథిలావస్థకు చేరుతున్నాయి.

- జింఖానా సర్కిల్ వద్ద ఏలూరు కాలువపై నిర్మించిన వంతెన శ్లాబు, పిల్లర్లకు మధ్య పదుల సంఖ్యలో చెట్లు ఉన్నాయి. వేర్లు రెయిలింగ్ చుట్టూ పెరిగి.. శిథిలావస్థకు చేర్చాయి.
- చిట్టూరి విశ్వేశ్వరయ్య పార్క్ సర్కిల్ వద్ద రూరల్ తహసీల్దార్ కార్యాలయం పక్కన రైవస్ కాలువ వంతెనకు మొక్కలు మొలిచాయి.
- బీఆర్‌టీఎస్ రోడ్డులోని మీసాల రాజారావు వంతెనకు పిల్లర్ల పక్కన చెట్లు పెరిగాయి.
- సత్యనారాయణపురం నుంచి ప్రభాస్ కాలేజీకి వెళ్లే మార్గంలోని వంతెనకు ఓ వైపు పెద్ద చెట్లు పెరిగాయి. దీని కారణంగా వంతెను ఫుట్‌పాత్ నెర్రెలిచ్చింది. మరోవైపు ఏపుగా పెరిగిన రావి చెట్టు కొమ్మలు నరికారు. మళ్లీ అవి చిగురులు వేస్తున్నాయి. వేర్లు పూర్తిగా తీసివేస్తే తరచూ పెరగకుండా నివారించే అవకాశం ఉంది.
- అలాగే సీతారామరాజు వంతెన వద్ద పడమర వైపు మొక్కలు మెలిచాయి.

వంతెనలపై మొలచిన మొక్కలు పెద్ద వృక్షాలు కాకముందే తొలగిస్తే వంతెనలు దెబ్బతినకుండా ఉంటాయి. వంతెనలకు ఇరువైపులా చెట్లు నరికి వేర్లు సైతం పెరికివేయాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు వైద్య పరీక్షలు



పాయకాపురం(విజయవాడరూరల్): పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యాన విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 700 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లజోళ్లను పంపిణీ చేశారు. అలాగే ఉపాధ్యాయులకు కూడా కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు, రోటరీ క్లబ్ ప్రతినిధులు, ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ మైనం హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శోభాయమానంగా శివరామకృష్ణ క్షేత్రం



విజయవాడ కల్చరల్: శృంగేరీ పీఠ ఉత్తరాధికారి శ్రీ విధుశేఖర భారతి మహాస్వామి విజయయాత్రలో భాగంగా ఆదివారం నుంచి నాలుగు రోజులపాటు శృంగేరీ పీఠపాలిత శివరామ కృష్ణక్షేత్రంలో బస చేయనున్నారు. దీనికి సంబంధించి ఏర్పాట్లు పూర్తి అయ్యాయని క్షేత్ర ధర్మాధికారి శిష్టాల హనుమత్ ప్రసాద్ శనివారం తెలిపారు. ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు వన్‌టౌన్ వినాయకుని గుడి నుంచి 50 మంది వేదపండితులు, 50 మంది వాయిద్య కళాకారులతో యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. పీఠంలో జరిగే కార్యక్రమంలో భక్తులు సంప్రదాయ వేషధారణలో రావాల్సి ఉంటుందని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాటు చేశామని వివరించారు. అర్చకుల కోసం ఏర్పాటు చేసిన శారదా సదనాన్ని స్వామి ప్రారంభిస్తారన్నారు. బీఆర్‌టీఎస్‌లో రోడ్డులో పార్కింగ్ ఉంటుందని ట్రాఫిక్ అంతరాయం లేకుండా సహకరించాలని కోరారు.

నేడు సామూహిక సత్యనారాయణ వ్రతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి వారి దేవాలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు దాట్ల వెంకట నరసింహ రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన కార్తిక మాసంలో విశిష్టమైన సత్యనారాయణ వ్రతం ప్రతి ఒక్కరూ చేసుకోవాలనే సదుద్దేశంతో సామూహిక వ్రతాలు ఏర్పాటు చేశామన్నారు. వ్రతం ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు.

నేత్ర పర్వంగా అన్నమయ్యతత్వ నృత్య రూపకం



విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీకనకదుర్గా నృత్యమందిర్ ఆధ్వర్యాన మూడు రోజులపాటు నిర్వహించే నాట్యాచార్యుడు యల్లాజోస్యుల రామకృష్ణ నృత్యోత్సవాలు శనివారం రెండవ రోజుకు చేరాయి. నాట్యాచారిణి యల్లాజోస్యుల అనూరాధ బృందం కూచిపూడి సంప్రదాయంలో పలు నృత్యాంశాలను ప్రదర్శించింది. అన్నమయ్య జీవితం ఆధారంగా డాక్టర్ చూడామణి కథా సహకారం అందించిన అన్నమయ్య తత్వం నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. అన్నమయ్య నారాయణ సూరి, లక్కమాంబ గర్భాన జనియించడం, బాల్యం, అన్నమయ్యలో శ్రీ వెంకటేశ్వరుని మీద భక్తి బీజాలు పడటం, తిరుమల కొండకు చేరుకొని కలియుగ నాథుని చూసిన వెంటనే భక్తి పారవశ్యంతో పాటలు పాడటం, సర్వమత సమానత్వం కోసం రచనలు చేయడం, రాజా గృహం, చివరకు స్వామి సన్నిధి చేరుకోవడం అంశంగా నృత్య రూపకం సాగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంస్కార భారతి అధ్యక్షుడు పి. విజయభాస్కర శర్మ మాట్లాడుతూ కూచిపూడి నృత్య సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు. సంగీత విద్వాంసుడు కుమార సూర్యనారాయణ, కళాపోషకుడు గరికపాటి భాస్కరం సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. నృత్య కార్యక్రమాలను నేతి విద్యాసాగర్, అనూరాధ నిర్వహించారు.

బస్సు ఢీ కొని రిక్షా కార్మికునికి గాయాలు

పాయకాపురం(విజయవాడరూరల్): ఆర్టీసీ బస్సు ఢీ కొని అప్పారావు(50) అనే రిక్షా కార్మికునికి గాయాలైన సంఘటన శనివారం సుందరయ్య నగర్‌లో జరిగింది. ఆటోనగర్ నుంచి రాజీవ్‌నగర్ వస్తున్న 48కే నెంబరు గల ఆర్టీసీ బస్సు ఫైర్‌స్టేషన్ రోడ్డు సుందరయ్యనగర్ వద్ద బియ్యం బస్తాలతో ప్లాటు ఫామ్ రిక్షా తొక్కుకుంటూ వెళ్తున్న అప్పారావును ఢీ కొట్టింది. ఈ ఘటనలో రిక్షా కార్మికుడు అప్పారావు ఎడమ చేతికి గాయం కావడంతో రక్తస్రావం అయ్యింది. స్థానికులు అప్పారావును ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన ప్రాంతానికి వచ్చి ఆర్టీసీ బస్సును పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

శాసనసభ సమావేశాలను వీక్షించిన విద్యార్థినులు


క్షేత్ర పర్యటనలో విద్యార్థినులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలను కంచికచర్ల గురుకుల కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థినులు శనివారం ప్రత్యక్షంగా వీక్షించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నల్లూరు నీరజ ఒక ప్రకటనలో తెలిపారు. శాసనసభ సమావేశాలను విద్యార్థినులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. కళాశాల అధ్యాపకులు సుధారాణి, దివ్య ఆధ్వర్యంలో నిర్వహించిన క్షేత్రపర్యటనలో భాగంగా విద్యార్థులు శాసనసభ సమావేశాలు, హైకోర్టు భవనాలు, ఉండవల్లి గుహలను సందర్శించారని వివరించారు. కళాశాల విద్యా విభాగ సంచాలకుడు డాక్టర్ నారాయణ భరత గుప్తా ఆదేశాల మేరకు జరిగిన విద్యార్థుల క్షేత్రపర్యటన కార్యక్రమం ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగినట్లు ప్రిన్సిపాల్ నీరజ పేర్కొన్నారు.

జాతీయ ఫార్మసీ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ సునీత, డాక్టర్ రమణ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు 63వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలను నిర్వహించనున్నారు. వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సునీత ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఈ ఏడాది థింక్ హెల్త్ – థింక్ ఫార్మసీ అనే నినాదంతో ఫార్మసీ వారోత్సవాలు చేపడుతున్నామన్నారు. మందుల వాడకంపై అవగాహన కలిగించే లక్ష్యంగా వారం రోజుల పాటు విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, డ్రగ్ కన్వర్‌జేషన్, వక్తృత్వం, గెస్ ద డ్రగ్, పోస్టర్ ప్రజెంటేషన్ వంటి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జి.రమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

'కోటి' ఆశలు ఆవిరి..

కారు బీభత్సంతో మృత్యువాత పడిన చిరు వ్యాపారి కోటేశ్వరరావు


భార్య, కుమారులతో కోటేశ్వరరావు(ఫైల్)

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నమ్ముకున్న వారు మోసం చేశారు.. వ్యాపారంలో తీవ్ర నష్టం చవిచూశాడు.. ఆస్తులన్నీ అమ్మేసి అందరి రుణం తీర్చేశాడు.. ఇప్పుడే కాస్త గుండె భారం తీరుతుందని ఊపిరి పీల్చుకునే లోపే భార్య పెరాలసిస్ బారిన పడిందనే చేదు వార్త కళ్ల ముందు ప్రత్యక్షమైంది. ఏ ప్రాంతంలో అయితే కారుల్లో.. కద్దరు దుస్తుల్లో వెళ్లాడో.. అదే ప్రాంతంలో తోపుడు బండిని పెట్టుకొని శనక్కాయలు అమ్ముకునే చిరు వ్యాపారిగా జీవితాన్ని మళ్లీ ఆరంభించాడు. అయితే కారు రూపంలో వచ్చిన మృత్యువు అతని ప్రాణాలను అర్ధాంతరంగా మింగేసింది. తన 'కోటి' ఆశలను ఆవిరి చేసేసింది. సింగ్‌నగర్ నందమూరినగర్‌లో శనివారం జరిగిన కారు ప్రమాదంలో మృతిచెందిన పేకా కోటేశ్వరరావు(49) దీనగాథ ఇదీ.

చావు కోసమే వెళ్లినట్లు ఉన్నాడు

సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన పేకా కోటేశ్వరరావుకు భార్య ఆర్యా నిర్మల(మిమ్మి), కుమారులు విజయ్‌కుమార్, వినయ్‌కుమార్ ఉన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే కోటేశ్వరరావును కొంతమంది స్నేహితులు మోసం చేయడం, కోవిడ్ సమయంలో వ్యాపారంలో బాగా నష్టం రావడంతో ఒక్కసారిగా ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాడు. దీంతో అతను సింగ్‌నగర్‌లోని తన ఇళ్లను విక్రయించి అప్పులన్నీ తీర్చేశాడు. భార్య మిమ్మి ఇటీవలే పెరాలసిస్ బారిన పడింది. కుటుంబ పోషణ కోసం సింగ్‌నగర్ నందమూరినగర్ రోడ్డులో ఓ తోపుడు బండిని పెట్టుకొని దానిపై శనక్కాయలు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నాలుగు రోజుల నుంచి బండి పెట్టకుండా ఇంటి వద్దే ఉన్న ఆయన శనివారమే బేరానికి వచ్చి కారు బీభత్సంతో మృత్యువాత పడ్డాడు.

శోకసంద్రంలో కుటుంబ సభ్యులు

అందరి మంచి కోరే కోటేశ్వరరావు మృత్యువాత పడిన విషయాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు బోరున విలపించారు. కోటేశ్వరరావు భార్య మిమ్మికి ఇంకా ఆయన మరణవార్త తెలియలేదు. నాన్నకు యాక్సిడెంట్ జరిగిందని మాత్రం కుమారులు ఆమెకు చెప్పారు. కోటేశ్వరరావు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు 304 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు


గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని విద్యార్థులు గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణంరాజు సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక రామకృష్ణాపురం శాఖా గ్రంథాలయంలో శనివారం స్వాతంత్రోద్యమంలో గ్రంథాలయాల పాత్ర అనే అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన పాల్గొని గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు. స్వాతంత్రోద్యమంలో గ్రంథాలయాలు కీలకపాత్ర పోషించాయని చెప్పారు. అలాగే విద్యార్థులు సెల్‌ఫోన్లతో కాకుండా పుస్తక పఠనం అలవర్చుకోవాలని సూచించారు. తొలుత అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కల్యాణి, ఉపాధ్యాయులు కృష్ణప్రసాద్, ఎంకే బేగ్ స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





బాలోత్సవం అదరహో

స్థానిక సిద్ధార్థ ఆడిటోరియంలో జరుగుతున్న 7వ అమరావతి బాలోత్సవం ఉత్సాహ భరిత వాతావరణంలో కొనసాగుతోంది. వేడుకల్లో భాగంగా శనివారం జానపద నృత్యం, తెలుగు పద్యాలు, శాస్త్రీయ నృత్యం, జానపద గీతాలాపన, దేశభక్తి, అభ్యుదయ గీతాలాపన, ఇంగ్లిష్ రైమ్స్, డ్రాయింగ్, బెస్ట్ ఫ్రమ్ వేస్ట్, షార్ట్ ఫిల్మ్ విశ్లేషణ, దినపత్రికా పఠనం, తెలుగు, ఇంగ్లిషులో వ్యక్తృత్వం, కథా విశ్లేషణ పోటీల్లో చిన్నారులు పాల్గొని అదరహో అనిపించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





ఎట్టకేలకు ఆక్రమణలు తొలగింపు


ముత్యాలంపాడులో ఆక్రమణలు తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎట్టకేలకు నగరపాలకసంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించారు. ముత్యాలంపాడు వీపీ నరసరాజు ప్రభుత్వ ముద్రణాలయం సమీపంలో అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ సిబ్బంది శనివారం తొలగించారు. ఇక్కడ ఇరిగేషన్ స్థలంలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు. ముత్యాలంపాడు శివాలయానికి కూత వేటు దూరంలో స్క్రాప్ వ్యాపారులు నిర్మిస్తున్న అక్రమ నిర్మాణం వల్ల స్థానికులు పడుతున్న అవస్థలు వివరిస్తూ సాక్షి శుక్రవారం 'ఇష్టారాజ్యంగా ఆక్రమణలు' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు ఆక్రమణలను తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ స్క్రాప్ వ్యాపారం వల్ల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని కావున తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

స్మార్ట్ రోడ్ల నిర్మాణానికి డ్రోన్లతో సర్వే

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలో స్మార్ట్ రోడ్ల నిమిత్తం నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర డ్రోన్లతో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న మూడు సర్కిళ్ల పరిధిలో పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో స్మార్ట్ రోడ్లను 11 ప్రాంతాల్లో 17 కిలోమీటర్ల మేర నిర్మించేందుకు ఈ సర్వే చేపట్టామన్నారు. ఈ రోడ్ సర్వే ద్వారా రోడ్లపై ఉన్న గుంతలు, డివైడర్, పేవర్ బ్లాగ్స్, ఫుట్‌పాత్‌లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పైప్ లైన్లను పరిగణనలో తీసుకుంటామని తెలిపారు. స్మార్ట్ రోడ్లను నిర్మించటంతో పాటు వాటి నిర్వహణ బాధ్యత కూడా ఏడాదిపాటు ఏజెన్సీదేనని చెప్పారు.

స్మార్ట్ రోడ్ల నిర్మాణం ఎక్కడెక్కడ?

స్మార్ట్ రోడ్లను సర్కిల్–1 పరిధిలో బీఆర్పీ రోడ్, కేటీ రోడ్డు, నెహ్రూ రోడ్డు, కుమ్మరిపాలెం సెంటర్, సితార సెంటర్లలో 7.3 కిలోమీటర్లు, అలాగే సర్కిల్–2 పరిధిలో బీఆర్టీఎస్ రోడ్డు, సాంబమూర్తి రోడ్డు, జీఎస్ రాజు రోడ్డు, కంట్రిక జంక్షన్‌లు 6.2 కిలోమీటర్ల మేర నిర్మించనున్నామని కమిషనర్ వివరించారు. అదే విధంగా సర్కిల్–3 పరిధిలో హెచ్‌టీ లైన్, గురునానక్ కాలనీ మెయిన్ రోడ్, పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్‌లలో 4.14 కిలోమీటర్లు నిర్మిస్తామని పేర్కొన్నారు.

ఉచిత యోగా శిక్షణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ కార్యాలయంలో ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత యోగాసనాలు ప్రతి రోజూ ఉదయం ఆరు నుంచి 7.30 గంటల వరకు జరుగుతాయన్నారు. ఆధ్యాత్మిక విశ్వ గురువు, వైజ్ఞానిక ఋషి, పూర్ణగురువులు శ్రీ గురు విశ్వస్ఫూర్తి వారు మానవాళికి అందించిన యోగా, ప్రాణాయామ, ధ్యాన ప్రక్రియ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి కలిగిన వారు 9849774745, 92464 84029 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రకాష్‌నగర్‌లోని ప్రభుత్వ సాంఘీక సంక్షేమ బాలుర వసతి గృహం వార్డెన్ సయ్యద్ కర్మాణీని జిల్లా కలెక్టర్(ఇన్‌చార్జి) నిధి మీనాన్ సస్పెండ్ చేసినట్లు జిల్లా సాంఘీక సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కె. శ్రీనివాస్ తెలిపారు. హాస్టల్ విద్యార్థులను కులం పేరుతో దూషించడం, వారిని హాస్టల్‌లో చేర్చుకునే సందర్భంలో డబ్బులు వసూలు చేయడం, విద్యార్థుల ట్రంక్ పెట్టెల్లో వస్తువులు, బట్టలను తస్కరించడం, విద్యార్థులను బార్‌లకు తీసుకెళ్లి మద్యం అలవాటు చేయడం లాంటి దుశ్చర్యలకు పాల్పడినట్లు వార్డెన్‌పై విద్యార్థులు ఆరోపించారు. ఈ ఆరోపణలపై జిల్లా సాంఘీక సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కె. శ్రీనివాస్, అసిస్టెంటు సోషల్ వెల్ఫేర్ అధికారి గణేష్ ఈనెల 13వ తేదీన విచారణ చేపట్టారు. విచారణలో విద్యార్థులు వార్డెన్ చేస్తున్న దుశ్చర్యలను వివరించారు. దీంతో అధికారులు విచారణలో విషయాలను జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. వార్డెన్ కిర్మాణీపై వచ్చిన ఆరోపణలు రుజువు కావడంతో ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనాన్ సస్పెండ్ చేస్తూ శనివారం ఆదేశాలు జారీ చేశారు. అలాగే హాస్టల్‌కు ఇన్‌చార్జి వార్డెన్‌గా భారతిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నరుపేట సెక్షన్, మ్యూజియం రోడ్డు విద్యుత్ ఉపకేంద్రం 11కేవీ సీవీఆర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం ఆదివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం రోడ్, జేడీ హాస్పటల్ రోడ్డు, దుర్గయ్య వీధి, బీసెంట్ రోడ్డు, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

దాసాంజనేయునికి సిందూర పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం శ్రీదాసాంజనేయ స్వామివారి దేవాలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకుపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి లోకేశ్వరి పర్యవేక్షించారు.

ఉత్తమ అధ్యయనంతోనే అద్భుత సాహితీ సృష్టి సాధ్యం



విజయవాడ కల్చరల్: ఉత్తమ అధ్యయనంతోనే అద్భుత సాహితీ సృష్టి సాధ్యమని విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ పింగళి వెంకట కృష్ణారావు అన్నారు. రసభారతి సాహితీ సంస్థ, గోళ్ల రాధాకృష్ణమూర్తి, పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సమితి ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఠాగూర్ గ్రంథాలయంలో శనివారం నవయుగ వైతాళికుడు–గురజాడ సాహితీ వైభవం అంశంగా సదస్సును నిర్వహించారు. వెంకట కృష్ణారావు మాట్లాడుతూ గురజాడ మహాకవిగా, యుగకర్తగా మన్ననలు అందుకోవడం వెనుక నిర్విరామ కృషి ఉందన్నారు. భాషావేత్త డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో గురజాడ చేపట్టని సాహిత్య ప్రక్రియలేదన్నారు. సాహితీ ప్రముఖులు గోళ్ల నారాయణరావు, పోన్నలూరి లక్ష్మణరావు గురజాడ సాహితీ వైవభం అంశంగా ప్రసంగించారు. కవులు జంధ్యాల కృష్ణమోహన్, పేర్ల దాసు, ఎం. అంజయ్య, డాక్టర్ కె. సరళ, ఎస్. శారద, గోవాడ శేషారత్నం స్వీయ కవితాగానం చేశారు. రసభారతి కార్యదర్శి జంధ్యాల పరదేశిబాబు నిర్వహించారు.

మొక్కుబడిగా వారోత్సవాలు

కూటమి ప్రభుత్వం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను మొక్కుబడిగా నిర్వహిస్తోందని కవులు, రచయితలు ఆరోపిస్తున్నారు. నిధులు లేకపోవడం, పుస్తక ప్రదర్శన కూడా మమ అన్న రీతిలో నిర్వహించడం జరుగుతోందని పెదవి విరుస్తున్నారు.





అలరించిన సంప్రదాయ నృత్యాలు

నగరంలోని సీతారామపురం ఐకాన్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన సంప్రదాయ నృత్యాలు అలరించాయి. 400 మంది విద్యార్థులు 28 రాష్ట్రాల సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. 40 సెకండ్లలో భారతదేశ పటం ఆకారంలో ఏర్పడి రికార్డు నెలకొల్పారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

